ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శుక్రవారం 9 ఆగస్టు 2024



నిజలింగప్ప సిద్ధాంతాలు స్ఫూర్తిదాయకం : సీఎం

బెంగళూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి పునాది వేసిన నిజలింగప్ప సిద్ధాంతాలు స్ఫూర్తిదాయకమని సీఎం సిద్దరామయ్య అభిప్రాయ పడ్డారు. మాజీ సీఎం నిజలింగప్ప వర్ధంతిని పురస్కరించుకుని గురువారం విధానసౌధలోని ఆయన విగ్రహానికి పూలుజల్లి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం నిజలింగప్ప ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. అన్ని వర్గాల పేదలకు న్యాయం చేసే దిశగా ఆయన పాటు పడ్డారన్నారు. కార్యక్రమంలో పరిషత్ సభాపతి బసవరాజ్ హొరట్టితో పాటు నిజలింగప్ప కుటుంబ సభ్యులు భాగస్వాములయ్యారు.


సీఎం సిద్దరామయ్యతో ఏపీ డీసీఎం పవన్ కల్యాణ్

బలపడుతున్న బంధం

- ఏపీ, కర్ణాటక మధ్య పెరుగుతున్న సంబంధాలు
- డీసీఎం పవన్‌కల్యాణ్‌కు అపూర్వ స్వాగతం
- అటవీ సంపద రక్షణకు పలు నిర్ణయాలు
- వన్యప్రాణులపై దాడులు అరికట్టడంపై చర్చ

సమావేశంలో మాట్లాడుతూ..



బెంగళూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలతో కర్ణాటకకు దశాబ్దాల కాలంగా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఇటీవల అవి మరింత బలపడుతున్నాయి. కొన్నేళ్లుగా జలవనరులకు సంబంధించి ఒకటి రెండు సభలు మినహా మిగిలిన విభాగాలపై చర్చలు జరిగిన దాఖలాలు లేవు. ఆంధ్రప్రదేశ్‌లో రెండునెలల కిందటే ఏర్పడిన ఉమ్మడి ప్రభుత్వం సరికొత్త విధానానికి తెరలేపింది. రోజుల వ్యవధిలోనే ఆంధ్రప్రదేశ్ డీసీఎం పవన్‌కళ్యాణ్ పంపిన ప్రతిపాదనలపై కర్ణాటక అటవీ శాఖా మంత్రి ఈశ్వర్‌ఖండ్రే సానుకూలంగా స్పందించారు. గురువారం బెంగళూరు విధానసౌధ వేదికగా రెండు రాష్ట్రాలకు సంబంధించి కేవలం అటవీశాఖకు మాత్రమే కాకుండా వివిధ అంశాలపై చర్చలు సాగాయి.

అటవీ సంపద, వన్యప్రాణుల రక్షణే కీలకం

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లకు అనుబంధంగా వివిధ ప్రాంతాలలో సరిహద్దులు ఉన్నాయి. చిత్తూరు జిల్లా కుప్పం ప్రాంతంలో ఏనుగుల దాడులు, ఇదే జిల్లాలో విస్తారంగా ఉండే రక్తచందనం అక్రమ రవాణా పెను సవాల్‌పై చర్చలు జరిగాయి. డీసీఎం పవన్‌కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రతిపాదించిన వివిధ అంశాలకు మంత్రి ఖండ్రే సమ్మతించారు. ప్రధానంగా ఏడు అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు.

వీటిలో ఏపీ నుంచి అక్రమంగా రవాణా అయ్యే ఎర్రచందనంను సమగ్రంగా నియంత్రణ చేసేలా జరిపిన చర్చలకు అంగీకరించారు. ఏపీ నుంచి కర్టాటక మీదుగా రవాణా చేసేందుకు ప్రయత్నించిన రూ.140 కోట్ల విలువైన ఎర్రచందనంను అటవీ అధికారులు స్వాధీనం చేసుకోవడంపై పవన్‌కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. వన్యప్రాణుల నుంచి మనుషుల రక్షణపై చర్చించారు. కర్ణాటకలోని వివిధ అభయారణ్యాలలో వందలాది శిక్షణ పొందిన(కుమ్కీ) ఏనుగులు ఉన్నాయి. ఇప్పటికే 67 ఏనుగులను వివిధ రాష్ట్రాలకు పంపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ఏనుగుల దాడులు పెరగడంతో ఎనిమిది 'కుమ్కీ' ఏనుగులు అవసరంగా ఇప్పటికే పంపిన ప్రతిపాదనల విషయమై కూడా చర్చించారు. ఎకో టూరిజం, వన్యప్రాణుల గురించి శిక్షణలు, ఏనుగుల నుంచి రక్షణకు సంబంధించి చైతన్యం, అటవీ, వన్యప్రాణులకు సంబంధించి ఇరురాష్ట్రాల మధ్య జ్ఞానాన్ని పెంచుకునే అంశాలపై తరచూ సమీక్షలు జరుపదలచారు. తొలివిడతగా ఇద్దరు మంత్రుల మధ్య జరిగిన చర్చలు కావడంతో అవగాహనకు వచ్చారు. ఇవే విషయాలపై త్వరలోనే ఒక ఒప్పందం చేసుకోదలచారు. మరో నాలుగు రోజులలోనే మానవాళిపై ఏనుగుల దాడులు అనే విషయమై జాతీయ స్థాయి చర్చాగోష్ఠి బెంగళూరులో జరుగనుంది. ఇందులో రెండు రాష్ట్రాల సమస్యలను పరిగణలోకి తీసుకోవాలని భావించారు. ఏడాది వ్యవధిలో ఏనుగుల దాడిలో కర్ణాటక పరిధిలో 30మందికి పైగాను ఏపీలో 20మందికి పైగా మృతి చెందిన అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. రెండు రాష్ట్రాలలోను ఏనుగులు, పులులు, చిరుతలు ఉన్నాయి. వీటి సంరక్షణపైనా చర్చలు జరిపారు.


మంత్రి ఈశ్వర్ ఖండ్రేను సత్కరిస్తున్న పవన్

అధికారులకు పవన్ అభినందన


ఆంధ్ర నుంచి అక్రమంగా కర్ణాటకకు వచ్చిన రూ.140కోట్ల విలువైన రక్తచందనాన్ని పట్టివేసినందుకు పవన్‌కళ్యాణ్ ప్రత్యేకంగా కర్ణాటక అటవీశాఖాధికారులను అభినందించారు. ఇదే సందర్భంలోనే మంత్రి ఈశ్వర్‌ఖండ్రే తెలుగువారితో తవకు సన్నిహిత సంబంధమన్నారు. బీదర్ ప్రాంతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో సంబంధాలు కలిగి ఉన్నందున ఎన్నో ఏళ్ళుగా వ్యాపార, వాణిజ్య, బంధువుల రూపంలో సత్‌సంబంధాలు ఉన్నట్లు తెలిపారు. భావనలు వేరైనా రెండురాష్ట్రాల ప్రజల అభిప్రాయాలు ఒక్కటే అనడం ప్రత్యేకం.

దోపిడీ చేసే హీరోయిజం..

అటవీ సంపదను దోచేసేలాంటి సినిమాకు సంబంధించి పవన్‌కళ్యాణ్ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. 40 ఏళ్ళ కిందట 'గంధదగుడి' అనే సినిమా అటవీ సంపదను రక్షించే విధంగా ఉందని నేటి సినిమా దోపిడీనే హీరోయిజంగా మారిందని చేసిన వ్యాఖ్యలు గంటల వ్యవధిలోనే తెలుగు రాష్ట్రంలో సంచలనమైంది. పుష్ప సినిమా పూర్తిగా ఎర్రచందనం దోపిడీ చేసే సినిమా కావడం విశేషం.

ముఖ్యమంత్రిని కలిసిన పవన్‌కళ్యాణ్

బెంగళూరు పర్యటనకు వచ్చిన డీసీఎం పవన్‌కళ్యాణ్ అధికారిక నివాసం కావేరీలో సీఎం సిద్దరామయ్యను కలిశారు. డీసీఎం హోదాలో తొలిసారి వచ్చిన పవన్‌కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి ప్రత్యేక అభిమానంతో స్వాగతించి సత్కరించారు. కాగా అటవీ మంత్రి ఈశ్వర్‌ఖండ్రేను శాలువాతో సత్కరించిన పవన్‌కళ్యాణ్ తిరుమల ప్రసాదం, వెంకటేశ్వర స్వామి విగ్రహం, అరకు కాఫీ ప్యాకెట్‌లు అందించారు. ఈశ్వర్‌ఖండ్రే వివిధ నమూనాలతో పాటు శాలువాతో సన్మానం చేశారు.


వినతిపత్రాలు స్వీకరిస్తూ..


పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు




ఆకట్టుకుంటున్న పూల పార్లమెంట్ భవనం..

పరిమళించిన రాజ్యాంగస్ఫూర్తి

- అంబేద్కర్ ఆశయాలు చాటిచెప్పేలా పూల ప్రదర్శనలు
- లాల్‌బాగ్ ఫ్లవర్ షో ప్రారంభంలో సీఎం సిద్దరామయ్య


ఫ్లవర్‌షో ప్రారంభిస్తున్న సీఎం

బెంగళూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడికి రాజ్యాంగస్ఫూర్తి కలిగించేలా లాల్‌బాగ్ పూల ప్రదర్శన ఏర్పాటు చేయడం హర్షణీయమని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. రానున్న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని లాల్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన 216వ ఫలపుష్ప ప్రదర్శనలను గురువారం సీఎం సిద్దరామయ్య లాంచనంగా ప్రారంభించారు. ఉద్యానవనశాఖా మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున సహా పలువురు అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ సమాజంలో కులమతాలు, భాషలతో సంబంధం లేకుండా ప్రజలందరూ సమానంగా అవకాశాలు పొందాలన్నారు. ప్రజలకు ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్యం లభించినప్పుడు మాత్రమే రాజకీయ స్వాతంత్ర్యం సాధ్యం కానుందన్నారు. అంబేద్కర్ బాల్యం నుంచి జీవితకాలం సాధనలను వివిధ రూపాలలో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంతోనే సమాజంలో అన్ని వర్గాలకు హక్కులు, సమానత్వం సాధ్యమైందన్నారు. అందుకే రాజ్యాంగ శిల్పిగా అంబేద్కర్‌ను కొనియాడుతారన్నారు. అంబేద్కర్ జీవితంలో ప్రముఖమైన బౌద్ధమత స్వీకరణ, రాజ్యాంగ ఆశయాలు, ప్రజాప్రభుత్వం సందేశాలకు అనుగుణంగా పూల ప్రదర్శనలు ఉన్నాయన్నారు. ఉద్యానవనశాఖా మంత్రి ఎస్ఎస్ మల్లికార్జునతో పాటు మంత్రులు జమీర్‌అహ్మద్, రామలింగారెడ్డి, నాయకులు అజయ్‌సింగ్, రేవణ్ణ, యూబీ వెంకటేష్, శరవణ పాల్గొన్నారు.

అందమైన పూల పార్లమెంట్ భవనం...

అందమైన పూల పార్లమెంటును రూపొందించినట్లు ఉద్యానవనశాఖ డైరెక్టర్ డీఎస్ రమేష్ తెలిపారు. పార్లమెంట్ భవనాన్ని 3.60లక్షల గులాబీలు, 2.40 లక్షల చామంతులతో తీర్చిదిద్దామన్నారు. ఇదేప ప్రాంగణంలోనే 12 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. అంబేద్కర్ జన్మస్థల నమూనాను 3.40 లక్షల పూలతో ఏర్పాటు చేశామన్నారు. కలారామ్ ఆలయ ప్రధాన ద్వారం, కోరేగావ్ విజయోత్సవ స్థంభం కళాకృతులు, వర్టికల్ గార్డెన్, భారతదేశం మ్యాప్, రాజ్యాంగ పీఠిక, హిరాకుడ్ ప్రాజెక్టు, అంబేద్కర్ తల్లిదండ్రుల చిత్రాలు, ప్రేరక శక్తి భవన్, బుద్ధ విగ్రహాలను పూలతో అలంకరించారు.

నమూనాల ఏర్పాటుకు 2.80 కోట్ల ఖర్చు...

పూల ప్రదర్శనలకు రూ.2.80 కోట్ల మేర ఖర్చు చేశామన్నారు. అంథోరియం, లిల్లీ, ఆర్కిడ్, జర్‌బేరా, చామంతులు, నందికొండల ఇంపేషన్స్ పూలు, అగాపాంథస్, సుగంధరాజలతో కలిపి 200లకు పైగా రకాల పూలను ఉపయోగించామన్నారు. సుమారు 30-32 లక్షల పూలతో రూపాలను తయారు చేశామన్నారు. 8లక్షల పూలను వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చామన్నారు. ఈ ఏడాది 12 లక్షల మంది దాకా సందర్శకులు వస్తారని భావిస్తున్నామన్నారు.

సెల్ఫీలతో సందడి




ఆకట్టుకుంటున్న ద్వారం



మనస్సు.. ఖాళీ..!




కాళీ నదిలో వంతెన కూలిన దృశ్యాలు..

- కారవార తీపి గురుతు "కాళీ వంతెన"
- 40 ఏళ్ల బంధానికి తెర
- అత్యవసర వేళ ఆదుకుంది..స్థానికుల ఆవేదన
- కో ఎన్‌హెచ్‌ఏఐను పరిశీలించిన అధికారులు

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 8: నాలుగు దశాబ్దాలుగా సేవలందించింది.. ఎన్నోసార్లు అ్యవసర పరిస్థితుల్లో దారి చూపి రక్షించింది..కళ్లెదుటే కుప్పకూలింది..అంటూ కారవార ప్రజలు కాళీ వంతెనను గుర్తు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో శిరూరు కొండచరియలు విరిగిపడి ఘటన మరవక మునుపే 41ఏళ్ళ క్రితం నిర్మించిన పురాతన కారవార - గోవా మధ్య సంచారానికి ఉపయోగిస్తున్న కాళీ వంతెన మంగళవారం అర్ధరాత్రి తరువాత నదిలో కూలిపోయింది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం జాతీయ రహదారుల అథారిటీ అధికారులు కూలిన వంతెన ప్రాంతాన్ని పరిశీలించారు. అరేబియా మహాసముద్రం, సహ్యాద్రి పర్వత శ్రేణులు కారవార ప్రాంతానికి ఆనుకుని ఉన్నా... కారవార అంటేనే గుర్తుకు వచ్చేది " కాళీ వంతెన " మంగళవారం అర్ధరాత్రి ఉన్న ఫళంగా కూలిపోయింది. దీంతో కారవార ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఉన్న ఓ బంధం తెగిపోయిందని మదనపడుతున్నారు. ఈ ప్రమాదంలో గోవా నుంచి కారవార వరకు వస్తున్న లారీ నదిలో మునిగి పోగా... ప్రయాణాయ స్థితిలో ఉన్న లారీ డ్రైవర్‌ను స్థానికులు కోస్ట్‌గార్డ్‌లు కాపాడి ఆసుపత్రిలో చేర్పించారు. వంతెన శిథిలావస్థలకు చేరుకోవడంతో ఇదే ప్రాంతంలో కాళీ నదికి అడ్డంగా నిమిదేళ్ళ క్రితం నూతన వంతెన నిర్మాణమైంది. కారవార ప్రకృతి సౌందర్యాలలో ఒకటిగా చెప్పుకుంటున్న కాళీవంతెన చూడడానికి కారవారకు చేరుకున్న ప్రతి పర్యటకుడు కాళీ వంతెన చూడకుండా వెనుదిరిగేవారు కాదని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. కాళీనదిపై సుమారు 41సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ వంతెన కేవలం జనసంచారానికే కాకుండా కారవార బ్రాండ్‌గా గుర్తింపు పొందింది. చాలా కన్నడ చలన చిత్రాలు ఇదే వంతెనపై నిర్మించినట్లు స్థానికులు అనుభవాలను గుర్తు చేసుకుంటున్నారు. అయితే ప్రస్తుతం కాళీ వంతెన ఒక గుర్తుగానే మిగిలిపోయిందని, కారవార ప్రజల భావోద్వేగాలకు తీపి గురుతుగా మిగిలిపోయిందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

- ఒకప్పుడు అరేబియా మహాసముద్రానికి చేరే కాళీ నదిపై వంతెననిర్మాణం సాహసోపేతంగా మారింది. 665 మీటర్ల పొడవు ఉన్న కాళీనదిపై వంతెన నిర్మాణానికి సరాసరి 19సంవత్సరాలు పట్టిందంటే... ఎంతకష్టపడాల్సి వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. కాళీ నదిపై వంతెన నిర్మాణానికి వచ్చిన ప్రతి ఒక్కరూ నష్టపోయినట్లు కథనాలు వినిపిస్తున్నాయి. మొదటి సారిగా 1965 సంవత్సరంలో కాళీనదిపై వంతెన నిర్మాణం ప్రారంభం కాగా, గ్యానన్ డంకర్లి అండ్ కంపెనీ పనులు కాంట్రాక్ట్ పొందింది. పనులు ప్రారంభం మనుపే కంపెనీ దివాళా తీసింది. నాలుగు సంవత్సరాల తరువాత ఉడని ఇంజనీరింగ్ కంపెనీ టెండరు పొంది తిరిగి పనులు ప్రారంభించింది. అయితే కంపెనీ పార్టనర్ చనిపోయిన నేపథ్యంలో మధ్యలోనే వంతెన నిర్మాణం పనులు ఆగిపోయాయి. తిరిగి వంతెన నిర్మాణం పనులను 1975 సంవత్సరంలో గ్యామన్ ఇండియా లిమిటెడ్ సంస్థ వంతెన నిర్మాణం పనులు ప్రారంభించింది. అప్పట్లో వంతెన నిర్మాణానికి రూ 2.65లక్షలు ఖర్చు చేసి సుమారు ఏడు7 సంవత్సరాల పాటు వంతెన నిర్మాణం పనులు సాగగా... 1982 సంవత్సరంలో వంతెన నిర్మాణం పనులు పూర్తి అయ్యాయి. అనంతరం 2009 సంవత్సరంలో వంతెన దెబ్బతినడంతో పాత వంతెన ప్రక్కనే 8 ఏళ్ళ క్రితం నూతన వంతెన నిర్మాణం జరిగింది. పాత వంతెన కూలిపోవడంతో కారవార-గోవాల మధ్య రాకపోకలు ప్రస్తుతం నూతన వంతెనపై సాగుతుండడంతో వంతెనపై తీవ్ర భారం పడే అవకాశం ఉందని స్థానికులు, అధికారులు భావిస్తున్నారు.
- ఘటన జరిగిన వెంటనే కొత్త వంతెనపై వాహన రాకపోకలు నిషేధిస్తూ కారవార జిల్లాధికారి ఆదేశాలు జారీ చేశారు. వాహనాల రాకపోకలు ప్రత్యామ్నాయ వ్యవస్థను కల్పించే ఉద్దేశంతో నూతన వంతెన సామర్థ్యం తెలుసుకునేందుకు జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా అధికారుల నివేదికల నేపథ్యంలో గురువారం జాతీయ రహధారుల అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు వంతెన కూలిన ప్రాంతాన్ని పరిశీలించారు. కొత్త వంతెన సామర్థ్యంపై నివేదికలు అందజేయడంతో పాటు వాహనరాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పడంతో కొత్త వంతెనపై తిరిగి కారవార - గోవాల మధ్య వాహన సంచారం ప్రారంభమైంది.


వంతెన కూలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు

అవినీతి సీఎంకు రోజులు దగ్గరపడ్డాయ్

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

బెంగళూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అవినీతి సీఎం సిద్దరామయ్య రాజీనామాకు రోజులు దగ్గరపడ్డాయ్ అంటూ బీజేపీ అధ్యక్షులు విజయేంద్ర సవాల్ విసిరారు. ఇటీవల అవినీతి పితామహుడు డీకే శివకుమార్ సారథ్యంలో జరిగిన కేబినెట్ భేటీలో సీఎంకు మద్దతుగా గవర్నర్‌కు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నారన్నారు. అవినీతి పరులంతా మైసూరుకు చేరుకున్నారని ఎద్దేవా చేశారు. శుక్రవారం మండ్య జిల్లా గాణగనూరు నుంచి పాదయాత్ర సాగింది. ఇదే సందర్భంలో విజయేంద్ర మాట్లాడుతూ అంబేద్కర్‌ను పొగిడే ముఖ్యమంత్రి సిద్దరామయ్య సమాజంలో అట్టడుగు వర్గాలు వాల్మీకుల కార్పొరేషన్‌కు కేటాయించి సంక్షేమాలు అందించకుండా కోట్లు లూటీపై ఏమని సమాధానం చెబుతారన్నారు. ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణ స్వామి, ఎంపీ రాఘవేంద్ర, నాయకులు అశ్వత్తనారాయణ, భగవంత్ ఖూబా, మురుగేష్ నిరాణి సహా రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొన్నారు.


తరలి వచ్చిన బీజేపీ నాయకులు


పాదయాత్రలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తదితరులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.45	1,627.86
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	57,819	17,464
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	59,839	8,892
సామర్థ్యం (టీఎంసీలు)	103.58	86.24

ఘనంగా నాగుల చవితి



పుట్టకు పాలుపోస్తున్నమహిళలు

బళ్లారి సిటీ, ఆగస్టు 8: శ్రావణ మాసం వచ్చిందంటే సంబరాలు అంబరాన్నంటుతాయి. ఈనెల మొదటి పండగ నాగుల చవితి. ఈ సందర్భంగా గురువారం భక్తులు ఆలయాల్లో నాగదేవత విగ్రహాలను పూజించారు. పుట్టల్లో పాలు పోసి తమ భక్తిని చాటుకున్నారు. కొత్తగా పెళ్లిఅయిన ఆడపిల్లలు ఈ నాగుల చవితి పండగకు పాలు పోసేందుకు స్వగ్రామానికి రావడం విశేషం. చాలా గ్రామాల్లో ఆడపిల్లలు చెట్టుకు ఉయ్యాల కట్టి ఊగుతూ పాటలు పాడుతూ నృత్యాలు చేయడంతో సర్వత్రా సందడి నెలకొంది.

స్వాతంత్ర్య వేడుకలకు విద్యార్థిని సాహితికి ఆహ్వానం



కందిబేడల సాహితి

బళ్లారి సిటీ, ఆగస్టు 8: ఆగస్టు 15న ఢిల్లీలో జరిగే 78వ స్వాతంత్ర్య వేడుకలకు బళ్లారికి చెందిన విద్యార్థిని కందిబేడల సాహితి విశేష అతిథిగా ఎంపికైంది. బళ్లారి అల్లం సుమంగళమ్మ స్మారక మహిళా మహావిద్యాలయంలో బీఎస్సీ 6వ సెమిస్టర్ చదువుతున్న ఆమె చదువుతో పాటు ఎన్ ఎస్ ఎస్‌లో చురుకుగా పాల్గొంటున్నారు. సమాజ కార్యక్రమాల్లో కూడా విరివిగా పాల్గొంటారు. దీంతో ఆమెను స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అతిథిగా ఎంపిక చేసినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కార్యాలయం నుండి పిలుపు వచ్చింది. ఈ సందర్భంగా వి.వి.సంఘం అధ్యక్షుడు అల్లం బసవరాజు, ఉపాధ్యక్షులు జానెకుంట బసవరాజు, కార్యదర్శి డా.అరవింద్ పాటిల్, కళాశాల అధ్యక్షురాలు కాత్యాయిని మరిదేవయ్య, కళాశాల ప్రధాన ఆచార్యులు హెచ్.రత్న, అధ్యాపకులు, తోటి విద్యార్థులు సాహితిని అభినందించారు. త్వరలోనే ఆమె హస్తినకు బయలుదేరి వెళ్లనున్నారు.

రోడ్డు విస్తరణ పనుల పునఃప్రారంభం



గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసు ఉన్నతాధికారులు

బళ్లారి రూరల్, ఆగస్టు 8: తాలుకాలోని పరమదేవనహళ్లి గ్రామంలో గృహిణుల తిరుగుబాటు కారణంగా ఆపివేసిన రోడ్డు వెడల్పు పనులను తిరిగి ప్రారంభించారు. ఎస్ఆర్‌సీ కన్‌స్ట్రక్షన్స్ అధికారులు గురువారం డీఎస్పీ వెంకటేష్, సీఐ రుద్రప్ప, ఎస్ఐ నాగభూషణ నేతృత్వంలో గ్రామ ప్రముఖులతో మాట్లాడి రోడ్డు వెడల్పు పనులకు అందరూ సహకరించాలని కోరారు. దీంతో పోలీసు బందోబస్తు మధ్య ఎక్స్‌కవేటర్లతో గురువారం రోడ్డు విస్తరణ పనులను తిరిగి ప్రారంభించారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న పలుఇళ్లను తొలగించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, పోలీసు ఉన్నతాధికారులు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్ష ఎన్నికలకు రిజర్వేషన్ల ఖరారు

సిరుగుప్ప, ఆగస్టు 8: సిరుగుప్ప నగరసభకు రెండవ విడత జరగనున్న అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారైనట్లు కమీషనర్ గురుప్రసాద్ గురువారం తెలిపారు. అధ్యక్షస్థానం ఎస్టీ మహిళకు, ఉపాధ్యక్ష స్థానం బీసీ మహిళకు రిజర్వేషన్ చేసినట్లు తెలిపారు. 17 నెలల నుంచి అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల రిజర్వేషన్లపై కోర్టులో కేసు నడుస్తోంది. ఇటీవల కోర్టు రిజర్వేషన్లు ప్రకటించాలని ఎన్నికలకమీషన్‌ను ఆదేశించడంతో వారు రిజర్వేషన్లను ప్రకటించారు. త్వరలో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజాధనం రోడ్లపాలు



- రోడ్ల నిర్మాణంలో లోపించిన నాణ్యత
- భారీ వాహనాల నియంత్రణలో అధికారుల నిర్లక్ష్యం... రోడ్ల నిర్వహణకు కోట్లాది రూపాయలు వృథా..



తారులేచిపోయి కంకర తేలిన రోడ్డు

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 8: రోడ్ల నిర్వహణ కోసం ప్రజాపనుల శాఖ ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా... గ్రామీణ ప్రాంతాలను కలిపే రోడ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గతుకుల రోడ్లలో గ్రామీణ ప్రాంతాల ప్రయాణం నరకప్రాయంగా మారింది. బళ్ళారి తాలూకా పరిధిలోని రూపనగుడి చుట్టుప్రాంతాలకు వెళ్ళే రోడ్లను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఎక్కడ చూసినా తారు రోడ్లు వాటి రూపాలను మార్చుకుని కంకర రోడ్లుగా దర్శనమిస్తున్నాయి. మరి కొన్ని ప్రాంతాల్లో కల్వర్టులు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయి ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్న దృశ్యాలు సర్వసాధారణమయ్యాయి.

సాధారణంగా ఒక ప్రాంతానికి కొత్త రోడ్డు వేసిన తరువాత కొంత కాలం పాటు సంబంధిత కాంట్రాక్టరే నిర్వహణ చేయాలని అగ్రిమెంట్‌లో నిబంధనలు ఉంటాయి. కాని సంబంధిత అధికారులు కాంట్రాక్టర్ల కుమ్మక్కుతో దెబ్బతిన్న రోడ్ల నిర్వహణ పేరుతో ఏటా బళ్లారి ప్రజా పనుల శాఖ డివిజన్ పరిధిలో కాంట్రాక్టర్లు, అధికారులు జేబులు నింపుకుంటున్నారు. రోడ్లను మెరుగుపరిచిన దాఖలాలు మాత్రం లేవు. నిర్వహణ పనులను చూడాల్సిన క్వాలిటీ కాంట్రోల్ వారు పనులు జరుగుతున్న ప్రాంతాల వైపు తొంగిచూడక పోవడంతో నిర్వహణ పనుల్లో నాణ్యత లోపిస్తోంది. పనులు పూర్తి చేసిన తరువాత కాంట్రాక్టరు తెచ్చిన ఎస్టిమేట్ ఆధారంగానే... పనులు సక్రమంగా పూర్తి చేసినట్లు సర్టిఫికెట్ ఇస్తూ... బిల్లులు డ్రా చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్న పంచాయతీ రాజ్, ప్రజా పనుల శాఖ అధికారులు కాంట్రాక్టర్లతో లోపాయకారి ఒప్పందాలు కుదుర్చుకుని కాంట్రాక్ట్ పనుల్లో వాటా దారులుగా చేరడంలో కాంట్రాక్టరు చేసిన పనులు బిల్లులు చేసుకోవడానికి ఎక్కడా అడ్డుకట్ట లేకుండా పోతోంది. ఇందులో పై అధికారుల పర్యవేక్షణ కొరవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. పనులు చేపడుతున్న అధికారుల్లో మార్పు వచ్చేంత వరకు గ్రామీణ ప్రజలు గుంతలు పడిన, కంకర తేలిన రోడ్లపై ప్రయాణించి కాళ్ళు చేతులు, నడుములు విరుచుకోవాల్సిందేగాని ప్రత్యామ్నాయ దారిలేదని గ్రామీణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూపనగుడి ప్రాంతంలో రెండుమూడు ఇసుక క్వారీలు ఉండడంతో నిత్యం పదుల సంఖ్యలో అధిక లోడుతో భారీ లారీలు ఇక్కడిరోడ్లపై సంచరిస్తుంటాయి. రోడ్లు దెబ్బతినడానికి ఇదే ప్రధాన కారణంగా ప్రజలు ఆరోపిస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

బస్సులు లేక అవస్థలు

ప్రైవేటు వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం



ఆటోకి కరచుకుని వెళుతున్న విద్యార్థులు

కంప్లి, ఆగస్టు 8 : ప్రభుత్వాలు గ్రామాలలో వుండే విద్యార్థుల విద్యాభ్యాసం కోసం ఎన్నో సదుపాయాలు కల్పిస్తున్నా, కొన్నిచోట్ల సదుపాయాలు లేక ఎంతో మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కంప్లి పట్టణంలో డిప్లమో కళాశాలకు వెళ్లే విద్యార్థులు ప్రతినిత్యం కళాశాలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. కంప్లి నుంచి కళాశాలకు మూడు కిలోమీటర్లపైగా దూరం వుండటంతో విద్యార్థులు వివిధ గ్రామాల నుంచి పట్టణానికి చేరుకుని అక్కడ నుంచి హోస్పేటకు వాహనాలలో లిఫ్ట్ అడిగి వెళ్లే పరిస్థితి ఏర్పడింది. గతంలో ఈ విషయంపై ఎమ్మెల్యే ఉదయం సాయంత్రం వేళల్లో కంప్లి బస్టాండు నుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేస్తామని చెప్పారు. అది కాకుంటే కంప్లి నుంచి హోస్పేటకు వెళ్లే బస్సులకు కళాశాల వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇంతవరకు అమలు కాలేదని విద్యార్థులు వాపోయారు. విద్యార్థులు కళాశాల నుంచి బస్టాండుకు ఆటోలో ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా హోస్పేటకు వెళ్లే బస్సులకు కళాశాల వద్ద ప్రత్యేక స్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కంప్లికి కాలినడక ప్రయాణం ఎన్నాళ్లు?

ఇబ్బందుల్లో రోగులు, పిల్లలు

కంప్లి, ఆగస్టు 8 : తుంగభద్ర నదికి నీరు పోటెత్తడంతో కంప్లి, గంగావతి రాకపోకలు పదిహేను రోజుల నుంచి బందయ్యాయి. కంప్లి నుంచి గంగావతికి వెళ్లాలన్నా, రావాలన్నా సుమారు 35 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సి వచ్చింది.. అధికారులు కేవలం వంతెనపై కాలినడకన వెళ్లేందుకు మాత్రమే అనుమతించారు. ఇందువలన జనం నానాఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రోగులు, పిల్లలు కాలినడకన వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. లేదంటే వాహనాల్లో చుట్టుతిరిగిరావల్సి వస్తోంది. ఇదంతా వ్యయప్రయాసలతో కూడిన పనే. దీంతో ఇప్పటికైనా అధికారులు పరిశీలించి ద్విచక్ర వాహనాలకు అనుమతులు ఇస్తే విద్యార్థులకు, రోగులకు అనుకూలంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరు వంతెనకు ఇరువైపులా వాహనాలు వుంచి తాము మాత్రం వంతెనపై కాలినడకన వెళుతున్నారు. ఇప్పటికైనా పీడబ్ల్యూడీ అధికారులు, జిల్లా అధికారులు వంతెనను పరిశీలించి త్వరగా ద్విచక్రవాహనాలకు వంతెనపై వెళ్లేందుకు అనుమతించాలని కోరుతున్నారు.



వంతెనపై నడుచుకుంటూ వెళుతున్న ప్రయాణికులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఏడుపడగల నాగప్ప

కంప్లి, ఆగస్టు 8 : నాగ పంచమి సందర్భంగా గ్రామాల్లో నాగదేవత విగ్రహాలకు పాలు పోసి పూజలు నిర్వహించారు. అలాగే బుక్కసాగరలోని ఏడుపడగల నాగప్పకు పూలతో ప్రత్యేకాలంకరణ చేపట్టారు. పంచమి సందర్భంగా వివిధ గ్రామాల నుంచి భక్తాదులు బుక్కసాగర గ్రామానికి వచ్చి ఏడుపడగల నాగప్పకు మొక్కులు సమర్పించుకున్నారు. అలాగే కంప్లి కోట పంపాపతి ఆలయం వద్ద నాగదేవత విగ్రహాలకు కూడా ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామాల్లో గురువారం ప్రతి ఇంట పండుగ వాతావరణం నెలకొంది.

20న దేవరాజ్ అరసు జయంతిని ఘనంగా నిర్వహించాలి

బళ్లారి సిటీ, ఆగస్టు 8: వెనుకబడిన తరగతుల అభివృద్ధికి ఆద్యుడు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డి.దేవరాజు అరసు జయంతిని జిల్లా యంత్రాంగం ఆగస్టు 20న అర్థవంతంగా నిర్వహించనున్నట్లు ఏడీసీ మహ్మద్ జుబేరా తెలిపారు. నగరంలోని కలెక్టరేట్ కార్యాలయ హాల్లో గురువారం డి.దేవరాజు అరసు 109వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ముందస్తు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆగస్టు 20 ఉదయం నగరంలోని వాల్మీకి భవన్‌లో వేదిక కార్యక్రమం జరుగుతుందని ఇందులో జిల్లా స్థాయి అధికారులు, అన్నిసంఘాల నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. వెనుకబడిన తరగతులలో ఆవిర్భవించిన డీ. దేవరాజు అరసు జయంతిని అర్థవంతంగా నిర్వహించేందుకు అని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈసందర్భంగా అతిథులను ఆహ్వానించాలని, తాగునీటి వ్యవస్థ పరిశుభ్రత చేపట్టాలని మున్సిపల్ కార్పోరేషన్ అధికారులను ఆదేశించారు. వెనుకబడిన హాస్టళ్ల పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో గత విద్యా సంవత్సరంలో పదవతరగతి, పీయూసీ, డిగ్రీ పీహెచ్‌డీ పట్టాలు పొందిన విద్యార్థులను సన్మానిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా జిల్లాలో సేంద్రియ వ్యవసాయంలో విజయం సాధించిన వెనుకబడిన తరగతుల రైతులను సన్మానించి సత్కరించాలని సూచించారు. దేవరాజ్ అరసుపై రిసోర్స్ పర్సన్‌తో ప్రత్యేక ఉపన్యాసం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జలాలప్ప, కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు నాగరాజు, తదితర శాఖల అధికారులు, కార్యాలయ అధికారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఏడీసీ మహ్మద్‌జుబేరా

రెండోరోజు కొనసాగిన క్రీడాపోటీలు



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థినులు

సిరుగుప్ప, ఆగస్టు 8 : సిరుగుప్పలో రెండవరోజు ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా క్రీడాపోటీలు జరిగాయి. పట్టణ హైస్కూలు గ్రౌండ్‌లో పీయుసీ విద్యార్థులకు రన్నింగ్‌రేస్, లాంగ్‌జంప్, హైజంప్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తిలకించడానికి వందలాదిమంది ప్రజలు, విద్యార్థులు విచ్చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఈ క్రీడా పోటీలను ఆసక్తికరంగా కొనసాగిస్తున్నారు.

వర్షాలు లేక ఎండుతున్న మెట్ట పంటలు

బళ్లారి సిటీ, ఆగస్టు 8: బళ్లారి, విజయనగరం జిల్లాలోని పలు గ్రామాలలో వర్షాలు లేక వేసిన పంటలు ఎండుతున్నాయి. గతేడాది కరువుతో అల్లాడుతున్న రైతులు ఈసారి వర్షాలు బాగా కురువడంతో మొక్కజొన్న, మునుకు జొన్నలను విత్తారు. మొదట్లో కనిపించిన వరుణదేవుడి దయ జూలైలో కనుమరుగు కావడంతో రైతులకు మళ్లీ కష్టాలు తప్పలేదు. రెండు నెలల పంటలైన మొక్కజొన్న, మునుకు జొన్నలు అడపాదడపా కురుస్తున్న జల్లులకు పెరుగుతాయనుకున్న తరుణంలో రెండు వారాలుగా వర్షాల లేకపోవడంతో ఎండిపోయే దశకు చేరుకోవడం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. విజయనగరం జిల్లా మరియమ్మనహళ్ళి ప్రదేశంలో మొత్తం ఇప్పటికే 2900 హెక్టార్లలో మొక్కజొన్న, మునుకు జొన్నలు వేశారు. 120హెక్టార్లలో వరి, 50హెక్టార్లలో కంది ఇతర తదితర పంటలు వేశారు. సుమారు 1000 హెక్టార్లలో నాట్లు పడకపోవడంతో రైతులు నిరాశచెందుతున్నారు. దీంతో రైతులు నాట్లువేయని ప్రాంతాల్లో వేరుశనగ, మినుము విత్తేందుకు వెళ్తున్నారు.



నీరు లేక ఎండిపోతున్న మొక్కజొన్న పంట

వ్యక్తిపై ముగ్గురు దుండగుల దాడి

బళ్లారిరూరల్, ఆగస్టు 8 : తాలుకాలోని పీడీ హళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గల జోళదరాసి కుంటి మారెమ్మ దేవస్థానం సమీపంలో భీమలింగ అనే వ్యక్తిపై ముగ్గురు గుర్తు తెలియని దుండగులు కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించారు. ఆయన స్థానికంగా ఓ హోటల్ నడుపుతున్నాడు. అయితే బుధవారంరాత్రి పది గంటల సమయంలో ముగ్గురు దుండగులు వచ్చి టీ వుందా? అని అడిగారు. టీ తీసుకొచ్చే సమయంలో కత్తితో భీమలింగపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. దీంతో ఆయన కేకలు వేయడంతో కుటుంబసభ్యులు, చుట్టుపక్కలవారు అక్కడకు వచ్చారు. దీంతో దుండగులు పారిపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని చుట్టుపక్కల పరిసరప్రాంతాల్లో గాలించగా దుండగులు వదిలివెళ్లిన రెండు ద్విచక్రవాహనాలు కనిపించాయి. వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గురువారం ఉదయం ఈ ఘటనపై బళ్లారి అడిషనల్ ఎస్పీ రవికుమార్, డీఎస్పీ వెంకటేష్, సీఐ రుద్రప్ప, ఎస్ఐ నాగభూషణ విచారించి దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దీనిపై పీడీ హళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హోసూరు జోన్

సీతారామాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



సర్వాలంకారాలతో ప్రజలకు దర్శనమిస్తున్న సీతారామాంజనేయస్వామి

హోసూరు ఆగస్టు 8 : హోసూరు సమీపంలోని పాతకోట గ్రామంల్లో 450 ఏళ్ల నాటి సీతారామాంజనేయ స్వామి ఆలయంలో వైభవంగా ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం సీతారామాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాని తర్వాత స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంల్లో అధిక సంఖ్యల్లో భక్తాదులు పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం గరుడ సేవ జరిగింది, విద్యార్థులు భరతనాట్యం కార్యక్రమం కూడా ఏర్పాటు చేశారు. భక్తాదులందరికి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

మునియప్ప స్వామికి విశేష పూజలు

హోసూరు జాతీయరహదారి మారుతీనగర్‌లోని ముత్తుమారియమ్మన్ ఆలయంలో తమిళులు విశేషంగా ఆడిపుర పండుగ జరుపుకుంటారు. అనంతరం ఈ ఆలయ ప్రాంగణంలో మునియప్ప స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి ఆలయ ప్రాంగణం ఎదుట ఉన్న భక్తాదులకు దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక , ఆంధ్ర, తమిళనాడు నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

హోస్మియా సంఘ కార్యవర్గ సమావేశం

హోసూరు ఆగస్టు 8 : హోసూరు హోస్మియా సంఘం కార్యవర్గ సమావేశం గురువారం హోసూరు సిఫ్‌కాట్ రాజేశ్వరీ లేఅవుట్‌లోని ఆ సంఘ కార్యాలయంలో అధ్యక్షుడు మురుగేశన్ అధ్యక్షతన జరిగింది. సంఘం కార్యదర్శి రజనీకాంత్ కోశాధికారి వెంకటేశం, కార్యవర్గ అధ్యక్షుడు మునుస్వామి నాయకత్వం వహించారు. ఈ సమావేశంలో హోసూరు ఇండియన్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ సతీష్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. హోసూరులో 300కు పైగా భారీ పరిశ్రమలు, 3 వేలకు పైగా చిన్న సూక్ష్మ పరిశ్రమలు పనిచేస్తున్నాయన్నారు. హోసూరులో వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్న పారిశ్రామికవేత్తలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు జీఎస్టీ చెల్లిస్తున్నారన్నారు. ఇండియన్ బ్యాంక్, జీఎస్టీ ఆధారంగా ఎటువంటి అభ్యంతరం లేకుండా వ్యాపార రుణాన్ని అందిస్తుందన్నారు. అలాగే సుమతీ 2,0 పథకంల్లో వ్యవస్థాపకుడికి 2 సంవత్సరాల ఆర్థిక నివేదిక ఆధారంగా 9 శాతం నుంచి 9.25 శాతం వడ్డీకి రుణం ఇస్తున్నామని, ఆటో విడిభాగాల తయారీ పరిశ్రమలకు తక్కువ వడ్డీకి రుణాలు అందజేస్తున్నామన్నారు. స్టాంప్ లోన్ కోసం రూ.10 లక్షల వరకు రుణసౌకర్యం ఉందన్నారు. పారిశ్రామికవేత్తలకు రూ.11 లక్షల నుంచి రూ.15 కోట్ల వరకు రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇండియన్ బ్యాంక్ అధికారిణి ఐశ్వర్య, వంద మందికి పైగా చిన్న పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



హోస్మియా సంఘం కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

జాలహళ్లిలో నకిలీ నోట్ల కలకలం..!



నకిలీ నోటుకు రెడ్‌పెన్నుతో మార్కు వేసిన బ్యాంకు అధికారులు

రాయచూరు, ఆగస్టు8: జిల్లాలోని దేవదుర్గ తాలూకా జాలహళ్లి పట్టణంలో నకిలీ నోట్ల కలకలం ప్రజలను ఆందోళనకు గురిచేసేదిగా మారింది. ఇటీవల పట్టణంలో రద్దీగా ఉండే ప్రదేశాలను ఎంచుకుని కొంతమంది దొంగ నోట్ల ముఠా వారు దుకాణాల్లో దొంగనోట్లను మార్పిడి చేసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు వ్యాపారులు గుర్తించారు. గురువారం పట్టణంలోని ఒక మెడికల్ షాప్ యజమాని తన సొమ్మును బ్యాంక్‌లో జమా చేసేందుకు వెళ్లగా అక్కడ అధికారులు అది నకిలీ నోట్‌గా గుర్తించారు. దీంతో ఒక్కసారిగా విస్తు పోయిన దుకాణదారుడు ఒక్కొక్కరే తమకు జరిగిన మోసాన్ని గురించి బయట పెట్టుకుంటున్నారు. కాగా వ్యాపారాల్లో తమకు వచ్చేది 300 లాభం కాగా అందులో 500 నోటు నకిలీదైతే ఇక నెత్తినోరు బాదకోవడమే మిగిలిందంటూ వాపోతున్నారు. బ్యాంకులో జమ చేసే సందర్భంగా అలాంటి నోట్లు పట్టుబడిన వెంటనే బ్యాంకర్లు దానిపై రెడ్‌పెన్నుతో ఇంటు మార్కు వేసి తిరిగిఇస్తున్నారు. ఈ విషయం కొంతమంది వ్యాపారులు చెబుతూ తమకు జరుగుతున్న అన్యాయాన్ని పోలీసులకు మొరపెట్టుకునేందుకు సిద్ధమయ్యారు.

సిద్దరామయ్యకు వ్యతిరేకంగా బీజేపీ-జేడీఎస్ కుట్ర

- మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు శ్రీదేవినాయక్

రాయచూరు, ఆగస్టు 8 : ప్రజారంజక పాలనతో రాష్ట్ర ప్రజల అభిమానాన్ని చూరగొంటున్న సిద్దరామయ్యను అప్రతిష్టపాలు చేసేందుకు బీజేపీ-జేడీఎస్‌లు కుట్ర పన్నుతున్నాయని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీదేవి నాయక్ ఆరోపించారు. ఈ విషయంలో రెండు పార్టీల కుట్రలు ఇటీవల మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వ్యవహారాల్లో వెలుగు చూశాయన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వ్యవహారాల్లో ముఖ్యమంత్రి ప్రమేయం లేకున్నా గవర్నర్ నేరుగా ముఖ్యమంత్రికి నోటీసులు జారీ చేయడం ద్వార ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నం జరిగిందన్నారు. ఈ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజభవన్‌లను దుర్వినియోగం చేయడం సిగ్గుచేటన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీదేవినాయక్

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

డాక్టర్ వీకే గోకాక్ (జయంతి)



కన్నడనాట గర్వించదగిన సాహితీవేత్త, 'పద్మశ్రీ' గ్రహీత వినాయక కృష్ణ గోకాక్ (వీకే గోకాక్) 1909 ఆగస్టు 9న కర్ణాటక రాష్ట్రం హాసన్ జిల్లా సవణూరులో జన్మించారు. కన్నడ వరకవి డీఆర్ బేంద్రె మార్గదర్శకత్వంలో సాహిత్యంపై మక్కువతో ముందుకు సాగారు. ఐదవ జ్ఞానపీఠ పురస్కారం పొందిన కన్నడిగుడు. 'భారత సింధు రశ్మి' పుస్తకానికి 1990లో పురస్కారం దక్కింది. అంతేకాక ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఆంగ్ల సాహిత్యంలో ఏ-గ్రేడ్‌లో ఉత్తీర్ణులైన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందారు. కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం, గౌరవడాక్టరేట్‌లు అందుకున్నారు. కాగా బెంగళూరు విశ్వవిద్యాలయం, పుట్టపర్తిలోని సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్‌కు వైస్-ఛాన్సలర్‌గా వ్యవహరించారు. 1992 ఏప్రిల్ 28న కన్నుమూశారు.

రేలంగి (జయంతి)



ఇంటిపేరుతోనే గుర్తింపు పొందిన రేలంగి వెంకటరామయ్య 1910 ఆగస్టు 9న తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జన్మించారు. తెలుగులో పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో హాస్య నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తనదైన ప్రత్యేకతను చాటుకుని రేలంగిగా పేరొందారు. శ్రీకృష్ణ తులాభారం సినిమాతో వెండితెరకు పరిచయమయ్యారు. 1970లో పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. నేపథ్య గాయకుడిగా కూడా రాణించారు. మిస్సమ్మ, దొంగరాముడు, అప్పుచేసి పప్పుకూడు, లవకుశ తదితర హిట్ సినిమాలలో నటించారు. 1975 నవంబరు 26న కన్నుమూశారు.

యల్లాప్రగడ సుబ్బారావు (వర్ధంతి)



దేశానికి చెందిన వైద్యశాస్త్రజ్ఞులలో చాలా ప్రసిద్ధి చెందిన వ్యక్తి 1895 జనవరి 12న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జన్మించారు. లెడర్లీ ప్రయోగశాలలో వైద్య బృందం నాయకులుగా ఫోలిక్ ఆమ్లం యొక్క నిజరూపాన్ని కనుగొన్నాడు. స్ప్రూ వ్యాధి, సైటిక్ ఎనీమియా అనే రక్తహీనతకు అద్భుతమైన మందుగా నిర్ణయించబడింది. అలాగే క్షయ రోగ నివారిణి కోసం ఐసోనికోటి నికాసిడ్, బోదకాలు టైఫాయిడ్‌లకోసం హైడ్రాక్సైడ్ వంటి మందులను కొనుగొన్నారు. బోదకాలు, టైఫాయిడ్, పాండురోగం తదితర వ్యాధులను నిర్మూలించగల మందులను కొనుగొన్నారు. 1948 ఆగస్టు 9న అమెరికాలో కన్నుమూశారు.

మహేశ్‌బాబు (పుట్టినరోజు)



టాలీవుడ్‌లో ప్రిన్స్‌గా పిలవబడే నటుడు ఘట్టమనేని మహేశ్‌బాబు 1975 ఆగస్టు 9న చెన్నైలో జన్మించారు. అత్యధిక రెమ్యూనరేషన్ అందుకుంటున్న నటులలో ఒకరు. ఒక్కడు, పోకిరి, సరిలేరు నీకెవ్వరు వంటి సినిమాలు బ్లాక్‌బస్టర్‌గా నిలిచాయి. 8నంది అవార్డులు, 5 ఫిల్మ్‌ఫేర్, 3 సినిమా, 3 సంతోషం అవార్డులు, ఇతర పురస్కారాలు అందుకున్నారు. తల్లిదండ్రులు, భార్య కూడా సినీరంగంలో పేరొందారు. కాగా ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

దీపా కర్మాకర్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత, జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ 1993 ఆగస్టు 9న త్రిపుర రాష్ట్రం అగర్తలలో జన్మించారు. 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకాన్ని సాధించిన తొలి మహిళా జిమ్నాస్ట్‌గా గుర్తింపు పొందారు. 2015 వరల్డ్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్‌లోనూ, రియోడిజనీరోలో జరిగిన 2016 సమ్మర్ ఒలిపింక్స్‌లోనూ పాల్గొన్నారు. 2018లోనూ జిమ్నాస్ట్ పోటీలలో గోల్డ్‌మెడల్ సాధించారు. రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న అవార్డు పొందారు.

రాచనగరిలో సభల సందడి..

● నేడు కాంగ్రెస్ జనాందోళన సభ.. ● రేపు బీజేపీ పాదయాత్ర ముగింపు సభ ● షామియానాల ఏర్పాటులో గందరగోళం



మైసూరులో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం సిద్దరామయ్య తదితరులు

బెంగళూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరంలో ఒకరోజు తేడాలోనే కాంగ్రెస్, బీజేపీలు సభలు నిర్వహించనున్నారు. దీంతో భద్రతా ఏర్పాట్లు, సభకు సన్నద్ధం చేయడంలో అధికారులకు టెన్షన్ మొదలయ్యింది. అయితే రెండురోజుల ముందునుంచే బీజేపీ తరుపున షామియానాలు ఏర్పాటు చేస్తుండగా తాజాగా కాంగ్రెస్ సభకు సంబంధించి ఏర్పాట్లు సాగిస్తుండగా వేర్వేరుగా అమర్చాలనే డిమాండ్ వివాదాలకు కారణమవుతోంది. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జనాందోళన సభ నిర్వహించదలచారు. ఇందుకు రెండురోజుల నుంచి వేదిక ఏర్పాటుకు మహారాజ కళాశాల ప్రాంగణంలో షామియానాల పనులు కొనసాగిస్తున్నారు. అంతకంటే ముందుగానే బీజేపీ నిర్వహించదలచిన ఛలో మైసూరు పాదయాత్ర ముగింపు సభకు కసరత్తు సాగుతోంది. శనివారం ముగింపు సభ జరగనుంది. ఇందులో రాష్ట్ర ప్రముఖ నేతలతో పాటు కేంద్రమంత్రులు భాగస్వాములు కానున్నారు. సాధారణంగా సభ నిర్వహించేందుకు నాలుగైదు రోజులకు ముందునుంచే షామియానాల ఏర్పాట్లు చేసుకుంటుంటారు. వర్షాకాలం కావడంతో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఒక రోజు వ్యవధిలోనే సభలు ఉండటంతో షామియానాలు అమర్చాల్సిన కాంట్రాక్టర్ ఇబ్బంది పడుతున్నారు. ఇదే విషయమై కాంట్రాక్టర్ షరీఫ్ మాట్లాడుతూ సీఎం సిద్దరామయ్య జరిపే ఎటువంటి కార్యక్రమాలకైనా మేమే సౌలభ్యాలు సమకూరుస్తామన్నారు. బిల్లు విషయం కూడా ముందుగా మాట్లాడుకునేది లేదన్నారు. మీటింగ్ ముగిశాక బిల్లులు ఇస్తే వాటికి అనుగుణంగా చెల్లించేవారు. ఇదే తొలిసారి బీజేపీ వారు పనులు మాకే ఇచ్చారన్నారు. షామియానా మాత్రమే సమకూరుస్తానని లైటింగ్, ఫ్యాన్‌లు, ఎల్‌ఈడీ స్క్రీన్‌ల వంటివి అద్దెకు తీసుకువచ్చి సమకూరుస్తానన్నారు. రెండు పార్టీలు వేర్వేరుగా పనులు చేపట్టేలా సూచించడంతో కష్టంగా మారిందన్నారు.

కేబినెట్‌లోకి బీకే హరిప్రసాద్..?

● నాగేంద్ర స్థానంలో తీసుకునే అవకాశం



బెంగళూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో చోటు చేసుకున్న అవినీతి కారణాలతో నాగేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఖాళీ అయిన స్థానానికి పార్టీ సీనియర్ నేత పరిషత్ సభ్యుడు బీ కే హరిప్రసాద్‌కు అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది. హరిప్రసాద్ ఏఐసీసీ సభ్యుడిగా వివిధ రాష్ట్రాలకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు నిర్వహిచారు. రాజ్యసభ సభ్యుడిగాను వ్యవహరించారు. ఏడాది కిందట ఎన్నికలు జరిగిదేకా క్రియాశీలకంగా కొనసాగారు. దాదాపు రెండేళ్ళ దాకా పరిషత్ ప్రతిపక్షనేతగాను కొనసాగుతుండేవారు. ఇదే సందర్భంలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో మంత్రి అవుతానని భావించారు. పరిషత్ సభానాయకుడు అవుతానని అనుకున్నారు. కానీ ఊహించని విధంగా హరిప్రసాద్‌కు కేబినెట్‌లో చోటు లభించలేదు. దీంతో ఆయన ఒక్కసారిగా ఖంగుతిన్నాడు. అప్పటి నుంచి సీఎం సిద్దరామయ్యపై తీవ్రమైన కోపంతో ఉన్నారు. ఒకానొక దశలో నాయకత్వం చేయడం వచ్చు.. మార్చడం కూడా అంటూ వ్యాఖ్యానించారు. ఈవిషయం తీవ్ర సంచలనానికి దారితీయగా అధిష్ఠానం నోటీసులు ఇచ్చింది. ఆతర్వాత మౌనంగా ఉంటూ వచ్చిన హరిప్రసాద్ ఒక్కసారిగా ప్రత్యర్థి అనేలా భావిస్తున్న సీఎం సిద్దరామయ్యను రెండురోజుల కిందట కలిశారు. మధ్యవర్తులతో పాటు అధిష్ఠానం పెద్దల సూచన మేరకే హరిప్రసాద్ కలిసినట్లు తెలుస్తోంది. కేబినెట్‌లో ఖాళీ అయిన స్థానంలో హరిప్రసాద్‌కు చోటు కల్పించాలనేది దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. అదే జరిగితే పరిషత్‌లో సభానాయకుడు మార్పు ఉంటుందా అనేది కూడా కీలకమే కానుంది. ప్రస్తుతం పరిషత్ నుంచి కేబినెట్‌లో ఉండే ఏకైక మంత్రి బోసరాజు సభానాయకుడిగా వ్యవహరిస్తున్నారు.

బాధితుల సమస్యలు పట్టించుకోరా..?

● కస్తూరి రంగన్ నివేదికపై చర్చ ఏదీ? ● పశ్చిమకనుమల వాసుల ఆవేదన కష్టాలు



చామరాజనగర జిల్లాలోని పశ్చిమ కనుమల సమీపాన ఓ గ్రామం

బెంగళూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు జిల్లాల్లో విస్తరించి ఉన్న పశ్చిమ కనుమలకు అనుబంధంగా నివసించే ప్రజల సమస్యలు విని ఆలకించేవారు కరువయ్యారు. పశ్చిమకనుమలలో జీవవైవిధ్య సంరక్షణ కోసం డాక్టర్ కస్తూరి రంగన్ నివేదికకు సంబంధించి బాధితులందరితో చర్చించి సమగ్ర నివేదిక ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఐఎఫ్ఎస్ అధికారి సంజయ్‌కుమార్ నేతృత్వంలో కమిటీ అన్ని గ్రామాల్లోనూ బాధితుల అభిప్రాయాలు సేకరించి నివేదిక ఇవ్వాల్సి ఉండేది. అయితే ఏ గ్రామాన్ని సందర్శించకుండా కనీసం ప్రజల అభిప్రాయాలు కూడా తెలుసుకోకపోవడం సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది. కస్తూరి రంగన్ నివేదిక ప్రకారం 1533 గ్రామాలలో పంచాయతీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు బాధితుల అభిప్రాయాలు కీలకం కావాల్సి ఉండేది. రాష్ట్రంలో 20,668 చదరపు కిలోమీటర్లకుపైగా విస్తీర్ణాన్ని పర్యావరణ సూక్ష్మ ప్రదేశంగా కస్తూరి రంగన్ నివేదికలో పొందు పరిచారు. చామరాజనగర, కొడగు, మైసూరు, హాసన్, శివమొగ్గ, చిక్కమగళూరు, ఉడుపి, ఉత్తరకన్నడ, బెళగావి జిల్లాలలోని 39 తాలూకాలలో 1533 గ్రామాలు ఉన్నాయి. రాష్ట్రంలోని పర్యావరణ సూక్ష్మ ప్రదేశంగా గుర్తించిన ప్రదేశంలో 75శాతం సురక్షితంగానే ఉంది. నివేదిక సమర్పించి పదేళ్ల పూర్తి కావడంతో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. సూక్ష్మ ప్రదేశంలో ఇళ్ల, గ్రామపంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలకు ఎటువంటి సమస్య లేదని వివరిస్తే శాశ్వత పరిష్కారం సాధ్యం కానుంది. జీవనోపాధి కోసం అటవీభూమిని ఆక్రమించుకుని పట్టా భూమి, ఆక్రమణ భూమి రెండుకలిపినా మూడు ఎకరాలకు మించి ఉండరాదని ప్రభుత్వం భావిస్తోంది. 2015లో ఇటువంటి ఆదేశాలు జారీ చేసినా ఇప్పటివరకు చట్టానికి అనుగుణంగా ఫిర్యాదులకు పరిష్కారం చూపలేదు. పశ్చిమకనుమలను సురక్షితంగా వదలాలని లేనిపక్షంలో ఆక్రమణలు కొనసాగితే భవిష్యత్తులో పెను సమస్య ఏర్పడనుందని డాక్టర్ కస్తూరి రంగన్ నివేదిక అభిప్రాయపడింది. రాష్ట్రంలో 2 లక్షల ఎకరాలకు పైగా అటవీభూమి ఆక్రమణలకు గురైంది. ఆరేడు జిల్లాల్లో అటవీప్రాంతాలకు అనుబంధంగా ఉండే పల్లెల్లో ఏటా పంటలసాగు ఇతరత్రా అవసరాలకు అటవీభూమిని ఆక్రమించుకుంటూ పోయారు. ఇది శతాబ్దాలకాలంగా సాగిన ప్రక్రియ. ప్రతి ప్రభుత్వంలోనూ ఈ అంశం చర్చకు వచ్చినా వివిధ కారణాలతో వాయిదా పడుతూ వస్తోంది. కస్తూరి రంగన్ నివేదిక అమలు చేస్తే వేలాది గ్రామాల పరిధిలో సూక్ష్మ ప్రదేశం అమలులోకి వస్తుంది. సదరు ప్రాంతాలలో ఎటువంటి నిర్మాణాలు, బోరు బావుల తవ్వకాలతోపాటు చిన్నపాటి ప్రహరీవంటి నిర్మాణాలు కూడా చేపట్టేందుకు వీలుండదు. ఇప్పటికే దశాబ్దాలకాలంగా అటవీభూములలో పంటల సాగుతో జీవనం చేస్తున్నవారు ఒక్కసారిగా ఉపాధి కోల్పోవాల్సి వస్తుంది. ఈ కారణంతోనే రాజకీయ పార్టీలు ఆచితూచి వ్యవహరిస్తుంటాయి. భూములు ఆక్రమించుకునేందుకు ముందుకెళితే వేలాదిమంది నుంచి వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం వెంటాడుతోంది. అయితే రాష్ట్రంలో అటవీ ప్రాంతాలలో పలుకుబడి కల్గినవారు రిసార్టులు, హోం స్టేలను వేల సంఖ్యలో ఏర్పాటు చేసుకున్నారు. వీరు దశాబ్దాలకాలంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. అటువంటి వారిని వదిలి సామాన్యులపై దాడి చేస్తారనే విమర్శలు ఉన్నాయి. కేరళలో వయనాడ్ సంఘటనతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేసి అటవీ ప్రాంతాలలో ఆక్రమణలను తొలగించేందుకు సిద్ధమయ్యారు. ఇది ఎంతవరకు అమలు చేస్తారనేది వేచి చూడాల్సి ఉంది.

తుంగభద్రకు తగ్గిన వరద

బొమ్మనహాళ్, ఆగస్టు 8: తుంగభద్ర జలాశయానికి వచ్చే వరద నీరు తగ్గుముఖం పట్టింది. గురువారం సాయంత్రానికి 48,239 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఒక్క అడుగు మేర 5 క్రస్ట్ గేట్లు ఎత్తి నది, కాలువలకు కలిపి మొత్తం 12,545 క్యూసెక్కుల నీటిని బయటకు వదులు తున్నారు. 1633 అడుగులతో 105 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో 1632.53 అడుగులకు చేరింది.

బఫర్ భయం

● వెయ్యి క్వింటాళ్లకు పైగా తేలని లెక్క
● వైసీపీ పాలనలో రేషన్ బియ్యం పక్కదారి
● అప్పట్లో అధికారులు, వైసీపీ డీలర్లు కుమ్మక్కు
● పాత్రధారులు, సూత్రధారులలో గుబులు



కంబదూరులోని సివిల్ సప్లై స్టాక్ పాయింట్

కళ్యాణదుర్గం, ఆగస్టు 8: రేషన్ షాపుల్లో బఫర్ బియ్యం వ్యవహారం కొలిక్కిరాలేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రేషన్ షాపులు నిర్వహించిన ఆ పార్టీ నాయకులు రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించారు. అప్పటి అధికారులు వారికి సహకరించారన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి అధికారంలోకి రావడంతో తాత్కాలిక డీలర్ల మార్పు జరుగుతోంది. రేషన్ షాపుల నిర్వహణ కూటమి నాయకుల ఆధీనం అవుతోంది. దీంతో బియ్యం బొక్కుడు వ్యవహారంలో సూత్రధారులు, పాత్రధారులు ఆందోళన చెందుతున్నారు. బయోమెట్రిక్ ద్వారా నిత్యావసరాల పంపిణీ ప్రారంభమైనప్పటి నుంచి ప్రతినెలా పంపిణీ తరువాత డీలర్ల వద్ద మిగిలి ఉన్న నిత్యావసరాలను కలిపి తదుపరి నెల సరుకుల అలాట్‌మెంట్ చేస్తారు. పాత డీలర్లు తమకు రావాల్సిన కమీషన్ జమ చేసుకున్నప్పటికీ... ఇంకా ఎక్కువగా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. తాము 2019లో బాధ్యతలు తీసుకున్నపుడు తమకు ఇలాగే బఫర్ ఇచ్చారని పాతవారు వాదనకు దిగుతున్నారు.

వెయ్యి క్వింటాళ్లకు పైగా బఫర్

కళ్యాణదుర్గం, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల పరిధిలో వెయ్యి క్వింటాళ్లకు పైగా బఫర్ ఉన్నట్లు అధికారులే చెబుతున్నారు. ఆ మండలాల పరిధిలో నలుగురే రెగ్యులర్ డీలర్లు. మిగిలిన వారు ఇన్‌చార్జులు, బినామీలే. చాలా మంది పరిధిలో క్వింటం నుంచి 30 క్వింటాళ్లకు పైగా బఫర్ ఉన్నట్లు తెలుస్తోంది. తాత్కాలిక డీలర్ల మార్పు ప్రారంభం కావడంతో బఫర్ సర్దుబాటుకు అధికారులు అగచాట్లు పడుతున్నారు. నెలన్నర నుంచి పోరాడుతున్నా బఫర్ సమస్య కొలిక్కి రాకపోవడంతో సివిల్ సప్లై అధికారులు, నూతన డీలర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బఫర్ లేకుండా తమకు స్టోర్‌లు అప్పగించాలని కొత్తవారు అధికారులను కోరుతున్నారు. మీరే మాట్లాడుకోండని కొత్తవారికి అధికారులు సలహా ఇస్తున్నట్లు సమాచారం.

బఫర్ బియ్యాన్ని అమ్మేశారు....

రాబోయేది వైసీపీ ప్రభుత్వమే అన్న ధీమాతో అప్పట్లో కొందరు డీలర్లు బఫర్ బియ్యాన్ని అమ్మేశారు. కొందరి వద్ద మాత్రం నిల్వలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. మరికొందరు బియ్యాన్ని అమ్మి జొన్నలు, రాగులను ఎక్కువగా చూపారు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాలకు కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో కర్ణాటక సరిహద్దు ఉంది. ఎక్కువగా ఇక్కడి నుంచే ఆ రాష్ట్రానికి రేషన్ బియ్యాన్ని తరలించినట్లు తెలుస్తోంది. కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న కేసులు ఈ మండలాల్లోనే ఎక్కువగా ఉన్నాయి. డీలర్లపై 6ఏ కేసులు పెట్టాలా క్రిమినల్ చర్యలు తీసుకోవాలా అని అధికారులు ఆలోచిస్తున్నారు.

బిగుస్తున్న ఉచ్చు

బఫర్ బియ్యం బొక్కుడు వ్యవహారం ఇప్పుడు తమ మెడకు చుట్టుకుంటోందని అందులో ప్రమేయం ఉన్న రెవెన్యూ స్టాక్ పాయింట్ అధికారులు ఆందోళన చెందుతున్నారు. వైసీపీ పాలనలో అధికారులు, డీలర్లు కుమ్మక్కై కర్ణాటకకు రేషన్ బియ్యాన్ని తరలించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలలో ప్రమేయం ఉన్న అధికారుల వివరాలను ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. పాత డీలర్లపై ఎక్కువగా ఒత్తిడి పెడితే తమ పేర్లు బయటకు పెడతారేమోనన్న భయం వారిని వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో బఫర్ బియ్యం లెక్కలను ఎలా తేలుస్తారోనన్నది వేచి చూడాలి.

రింగ్‌రోడ్డు నిర్మించండి

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరం చుట్టూ రింగ్‌రోడ్డు నిర్మించాలని కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కారీని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో గురువారం రింగ్‌రోడ్ గురించి ఎంపీ ప్రస్తావించారు. జిల్లా కేంద్రమైన అనంతపురంలో జనాభా నానాటికీ పెరిగిపోతోందని, ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. రింగ్‌రోడ్డు నిర్మాణమే ఈ సమస్యకు పరిష్కారమని అన్నారు. అనంతపురం-బుక్కరాయసముద్రం చెరువు, దేవరకొండ వంటి భౌగోళిక పరిమితుల కారణంగా పడమర దిశగా నగరం విస్తరిస్తోందని తెలిపారు. తద్వారా జాతీయ రహదారి-44 బైపాస్ కుడి, ఎడమ వైపు పరిశ్రమలు, వాణిజ్య, వసతి గృహాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ కారణంగా బైపాస్ రోడ్డు స్థానిక రహదారిగా మారిందని అన్నారు. రద్దీ కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వంతెనల నిర్మాణం జరిగినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. దీంతో రింగ్ రోడ్డు గురించి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని, దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఎంపీకి మంత్రి హామీ ఇచ్చారు.

షాపులో పనిచేస్తూనే చోరీకి స్కెచ్

కదిరి, ఆగస్టు 8: షాపులో ఏళ్లుగా పనిచేస్తున్న నమ్మకస్తుడే యజమాని ఇంట్లో చోరీకి స్కెచ్ వేశాడు. స్నేహితులతో కలిసి చోరీ చేసి, పోలీసులకు దొరికిపోయి కటకటాలపాలయ్యాడు. పట్టణంలోని మదనపల్లి రహదారిలోని యామినీ మెడికల్ స్టోర్ యజమాని ఇంట్లో చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఆ వివరాలను కదిరి పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ రత్న వెల్లడించారు. పట్టణానికి చెందిన మధుసూదన్ మదనపల్లి రహదారిలో యామినీ వెటర్నరీ మెడికల్ స్టోర్ నిర్వహిస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో షాపు, మొదటి అంతస్తులో ఆయన ఇల్లు ఉంది. పట్టణంలోని నిజాంవలీ కాలనీకి చెందిన షేక్ హైదర్‌వలీ షాపులో పదేళ్లుగా పనిచేస్తుండేవాడు. వ్యసనాలకు బానిసయ్యాడు. వాటిని తీర్చుకునేందుకు అప్పులు చేశాడు. ఈ నేపథ్యంలో ఈనెల 5న మెడికల్ షాపు నిర్వాహకుడు మధుసూదన్ రూ.11.30 లక్షల నగను ఇంట్లోని బీరువాలో ఉంచి అదేరోజు బెంగళూరు వెళ్లారు. విషయం భార్య కల్యాణికి చెప్పారు. విషయం తెలుసుకున్న హైదర్‌వలీ ఆ డబ్బు కొట్టేయాలని పథకం పన్నాడు. అందులో భాగంగా నిజాంవలీ కాలనీకి చెందిన మిత్రులు షేక్ అల్తాఫ్, కేదారి మహేష్‌తో కలిసి స్కెచ్ వేశాడు. ఐదో తేదీ మధ్యాహ్నం మెడికల్ షాపులో మధుసూదన్ భార్య కల్యాణి, హైదర్‌వలీ ఉన్నారు. కల్యాణి కంటపడకుండా అల్తాఫ్, మహేష్ వారి ఇంట్లోకి చొరబడేలా హైదర్‌వలీ సూచనలిచ్చాడు. వారు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉంచిన నగదు, 1.34 కిలోల వెండి వస్తువులను అపహరించుకుని వెళ్లిపోయారు. చోరీ చేసిన సొమ్ము నిజాంవలీ కాలనీకే చెందిన ఖాజాపీరా వద్ద ఉంచారు. షాపు యజమాని మధుసూదన్ 5వతేదీ అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇంటికి చేరుకున్నారు. 6న ఉదయమే బీరువాలో డబ్బు చూసుకోవడానికి తెరిచారు. బీరువాలో డబ్బు కనిపించకపోవడంతో భార్యను అడిగారు. ఆమె తెలియదని చెప్పడంతో బీరువాను క్షుణ్ణంగా పరిశీలించారు. బీరువాలోని నగదుతోపాటు వెండి వస్తువులు కూడా చోరీ అయినట్లు గుర్తించారు. బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ శ్రీలత.. పట్టణ సీఐ పుల్లయ్య, ఎస్ఐ బాబ్‌జాన్‌తో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. రెండు బృందాలుగా విడిపోయి, దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా ముగ్గురు వ్యక్తులు చోరీ చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. గురువారం స్థానిక నేహా ఫంక్షన్‌హాల్ సమీపంలో వారిని అరెస్టు చేశారు. వారితో పాటు ఖాజాపీరా కూడా అక్కడే ఉండడంతో నలుగురినీ అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10.30 లక్షల నగదు, 1.34 కిలోల వెండి వస్తువులు, మొబైల్ ఫోన్‌స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.12లక్షలు ఉంటుందని ఎస్పీ వెల్లడించారు. కేసును ఛేదించిన పట్టణ సీఐ పుల్లయ్య, ఎస్ఐలు బాబ్‌జాన్, బలరామయ్య, సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ విక్టర్, కానిస్టేబుల్ రామాంజులు, హరినాథ్‌రెడ్డి, నాగరాజు, శివశంకర్‌రెడ్డి, రాజప్పను ఎస్పీ అభినందించారు. రివార్డులు ప్రకటించారు.

జీడిపల్లికి చేరిన కృష్ణమ్మ

బెళుగుప్ప, ఆగస్టు 8: నీటి కోసం అల్లాడుతున్న కరువు జిల్లాకు ఈ ఏడాది 15 రోజులు ముందుగానే కృష్ణమ్మ తరలివచ్చింది. జీడిపల్లి రిజర్వాయరుకు గురువారం కృష్ణా జలాలు వచ్చాయి. గత ఏడాది ఆగస్టు 24న రాగా ఈఏడాది కాస్త ముందుగానే కృష్ణా జలాలు వచ్చి చేరాయి. రాగులపాడు ఎత్తిపోతల పథకం కింద రెండు పంపుల ద్వారా నీటిని వదులుతున్నారు. హంద్రీనీవా అధికారులు, రైతులు కృష్ణమ్మకు స్వాగతం పలికారు.

చీనీకాయలు టన్ను రూ.20వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 8: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20 వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15వేలుతో అమ్ముడు పోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు 506 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నేటి నుంచి 'బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్'

బెంగళూరు, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్‌కు ఐటీ నగరి బెంగళూరు సిద్ధమైంది. దేశవిదేశీ సాహితీవేత్తలు నగరంలోకి వచ్చేశారు. శుక్రవారం నుంచి మూడురోజుల సంబరాలకు కోరమంగళలోని సెయింట్‌జాన్స్ మెడికల్ కళాశాల ఆడిటోరియం సర్వాంగంగా తయారయ్యింది. భారతీయ భాషలలో సాహిత్య సేవలు అందిస్తున్న ప్రముఖులకు బుక్ బ్రహ్మ సంస్థ ద్వారా ఏటా బుక్‌బ్రహ్మ సాహిత్య పురస్కారం అందించడం ఆనవాయితీ. పురస్కారం కింద రెండులక్షల నగదుతోపాటు గౌరవ సత్కారం చేయడం ఆనవాయితీ. ఏటా భారతీయ భాష సాహితీవేత్తలకు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజున బుక్‌బ్రహ్మ కాదంబరి పురస్కారాన్ని ప్రముఖ తమిళ సాహితీవేత్త పెరుమాళ్ మురుగన్ ఇవ్వనున్నారు. రెండోరోజు స్వాతంత్ర్యోత్సవ కథా పోటీలు విజేతలకు మళయాళం రచయిత బెన్యామెన్ అందించనున్నారు. ఇదే సందర్భంలోనే బెన్యామెన్‌తో చర్చాగోష్ఠి జరగనుంది. చివరి రోజున బుక్‌బ్రహ్మ సాహిత్య పురస్కార ప్రధానం ఉంటుందని తెలిపారు. బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్ 2024 పేరిట ఉత్సవ్‌లో తెలుగు, కన్నడ, మళయాళం, ఇంగ్లీషు భాషలకు సంబంధించి 300మందికిపైగా సాహితీవేత్తలు భాగస్వాములు అవుతారు. 80కుపైగా చర్చాగోష్టులు జరగనున్నాయి. కన్నడ సాహితీ దిగ్గజాలు నాడోజా హంపా నాగరాజయ్య, డాక్టర్ మల్లేపురం జి. వెంకటేశ్, డాక్టర్ నడహళ్ళి బాలసుబ్రమణ్యం, సాహిత్య ఉత్సవ్ డైరెక్టర్, రచయిత సతీశ్ చప్పరికెలు పోస్టర్‌లు కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు జరుపుతున్నారు. ప్రపంచ సాహిత్యానికి కన్నడ, తెలుగు, తమిళ, మళయాళం భాషల సేవలు అపారమైనవన్నారు. చారిత్రాత్మకంగా మహత్తరమైన నాలుగు భాషలను ఒకే వేదికకు తీసుకొచ్చి చర్చాగోష్టులు జరుపుతున్నారు. నాలుగు భాషలతో కలిపి భారీ స్థాయిలో ఇంటువంటి ఉత్సవ్ దేశంలో మరెప్పుడూ జరుగలేదు. సాహితీవేత్తలతోపాటు దక్షిణభారత్‌లోని ప్రముఖ పబ్లిషర్స్ కూడా పాల్గొంటారన్నారు. పద్మశ్రీ గ్రహీత వెంకటేశ్ కుమార్, ఆర్‌కే పద్మనాభ, ప్రకాశ్‌రాజ్, బిందుమాలిని, మానసి సుధీర్, మేఘనా చంద్రమౌళి కళా ప్రదర్శనలు ఉంటాయి. మైసూరు నటన, శ్రీరంగపట్టణ రంగ ప్రదర్శన, కెరమనె మేళా బృందంచే యక్షగాన ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఆడిటోరియం ప్రాంగణంలో ఐదు భాషల్లో 60కుపైగా బుక్‌స్టాల్స్ ఏర్పాటు చేశారు. 20కుపైగా చిత్రకారులు, కృతుల ప్రదర్శన, విక్రయాలు ఉంటాయన్నారు. దక్షిణభారత ప్రజల మనసులు గెలిచేలాంటి సాహిత్య ఉత్సవం జరుగుతుందన్నారు. ప్రవేశం ఉచితం కాగా బుక్ బ్రహ్మ లిట్‌ఫెస్ట్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకున్న ప్రతినిధులకు ప్రత్యేక పాస్‌లు ఉంటాయన్నారు.





ఉత్సవానికి పూర్తయిన ఏర్పాట్లు